# ఏ రాయయితేం....!

-చావా శివకోటి

సీతాలు చక్కంగ చింత పిక్కెలాగుంటది.

అంత కుదమట్టంగ, ఎందుకుందో, ఆ అమరిక ఏందో- దేవుడయ్యకే తెలియాలి. నిజానికి సీతాలు తోవన నడుస్తుంటే- నాజూకుగ ఉందనిపించదు. వయ్యారాలు - అసలు పోదు. చానా మామూలుగ అనిపిస్తది. చూడబుద్ధవుతది. ఆలోచిస్తే మాత్రం నడకన, గిన్నెపందు ఒగరు తలపుకొచ్చి ఆగుతది. ఊరి చెరువుకు- మంచినీళ్ళకొచ్చి శుభ్రంగ నాల్గు మునకలేసి బిందెత్తుకొని వస్తుంటే కడిగిన ముత్యంలా అనిపించదు. కాకరకాయ చేదుతనం- గోగ్గూర పులువుదనం. చెరుకుగెడ తీపిదనం. కలబిలిపినట్టు అదోలా అనిపిస్తది. ఆబగ దాని వంపుసొంపులు చూడాలనీ అనిపించదు. అది ఎదురుగ ఉండగనే మనస్సెటో- ఎటో పోతది. పెంపుడు కుక్క నెంటేసుకొని- చొప్పదొడ్డేపు అది పోతుంటే, తెలీకుండానే- గుండెన చప్పుడు పెరుగుతది. నోట నీరూరతది.

దాని వంటిమీద కొచ్చిన వయస్సు. చిన్నతనపు గౌరదనాన్ని వదిలించుకొని. వనకన్యలాగయింది.

ఓసారి. ఎన్నికలపుడు. నిలబడ్డ M.L.A. మా ఊరికొచ్చాడు. ఓట్లడగడం కోసం. మంది వార్బలంతో బయలుదేరినాడు. వీధులు తిరుగుతుంటే. సీతాలు బడివూలన ఎదురుపడింది. అది ఎదురయిన తీరే M.L.A.కు ముచ్చెమటలు పోయించింది. కుదేళ్ళయి ఆగిండు.

'మన ఓటరే- చలాకీ' అని వందిమాగదులు చెవు కొరికినారు.

తెప్పరిల్లి. ముఖాన నవ్వు పులుముకొని- "నేను నిలబడ్డ. నిన్ను ఓటు అడిగేందుకే వచ్చిన." అన్నడు. నీ మనువెప్పుడే మరదలా! నన్ను పిలవడం మరచిపోతవేంది? అన్నంత ఇదిగ. వీలున్నంత మేర- సీతాల్ను చూస్తున్నడు.

ఓట్ల పండగ గనుక. వాంళ్ళ నాయకుడు ఓటు అడుగుతున్నడు గనుక. జనం చూస్తున్నరు. సీతాలూ ఆగింది.

ఓటడిగినోడి చుంచు మొఖం కనిపించాక. ఓటు సంగతి పెరమాళ్ళు కెరుక గాని- వానిపైన ఉమ్మి కూడా వేయ బుద్ధి కాలేదు. పార్టీకో రంగు చొక్కా వేస్తున్నారు గనుక వాని పార్టీ ఏదో మాత్రం అర్థమైంది. కోపం కూడా వచ్చింది. కాని ఈ రంకాటగాళ్ళతో మనకెందుకు. అన్నీ మరచి 'మాదాకవళం తల్లీ' అంట రోడ్డెంట పడ్డారనుకొని. ఈ దేశాన ఓటెవడికేసినా ఏట్లో ఏసినట్టే అని తలచి. అడిగింది అర్థం కానట్టుగ సిగ్గుపడింది. ఏం చేయాలో ఖచ్చితంగ అర్థం కానప్పుడు సీతాలు అట్టాగే చేస్తది.

ఇది ఎన్నికల 'ఉరుస'నీ. 'ఉట్టి నుంచి సొర్గానికి తోవ' రాయించుకొని- బట్టీ పట్టి రిహార్సలు వేసుకొని మరీ జనంలోకొస్తారని 'అవ్వ' చానాసార్లు చెప్పింది గుర్తుకొచ్చింది.

అది గుర్తుకొచ్చాక 'నవ్వింది'.

'నా వెంట ఉన్నది కుక్క. (దీనికి విశ్వాసముంటది) నీ వెనకున్న తోడేళ్ళ లాంటిది కాదు' అన్నట్టుందా నవ్వు.

గతుక్కుమన్నాడు M.L.A. రాజకీయం వంటబట్టినోడు గదా!

కుక్క దిసగా వంగి దాని తల నిమిరి 'దీన్ని చూత్తంటే నాకు సిగ్గయితది' అంది గారాలు పోతూ.

'ఏందో!' అన్నడు. ఈ సీనునూ ఓట్ల బ్యాంకుకు వినియోగించుకుందామని.

జనం- చూస్తున్నరు. జరుగుతున్నదాన్ని.

'దీని విశ్వాసం మనిషి కెప్పుడొస్తదో? ప్చ్!' అని నడచింది. నెమ్మదిగ.

సీతాలు- ఏ కాలి చెప్పు తీసి మొఖాన కొట్టిందో అర్థం గాలె. పేడ పిడచ మొఖాన విసరినట్టయింది.

బిక్క మొఖం వేసిండు. నరికెయ్యాలన్నంత

కోపం వచ్చింది. కళ్ళు కొద్దిగ ఎఱ్ఱబడ్డయి.

'ఓట్లు కానియ్' అనుకొని- ఏదో అంతా వానికే అర్థమయినట్టుగ పెద్దగ నవ్వి- ముందుకు నడచిండు.

అభ్యర్థి నవ్వాడు గనుక- 'ఇందులో ఏదో ఉంది' అనుకొని వెనకాతల జనమూ నవ్వారు.

'రాగి చెట్టు భాగోతం' గుర్తుకొచ్చిన కొద్దిమంది- వారూ నవ్వుకున్నారు నిండుగ.

అసలీ ఎన్నికలేంది? ఎవడో ఏడ నుంచో ఏంళ్ళకు టిక్కెట్లియ్యడమేంటి?

వాడు దాన్ని పట్టుకొని 'తగుదునమ్మా' అని ఊళ్ళకొచ్చి నాకే ఓటెయ్యమని అడగడమేంటి?

దానిలో వీనికున్న అర్హతేమిటి?

అసలు ప్రతివానికీ- మిగతా వాంళ్ళను పాలించాలనే 'కోరిక' కల్గడమేంటి?

అది మాటల మూటలిప్పి.

ప్రతి ఎన్నికకూ ఇదే తంతు. కాకుంటే కొత్త ముఖాలు. కొత్త వేషాలు. కొత్త మాటలు. పాత ముఖమే అయితే. పైసల కట్టలు. కొత్త అబద్ధాలు.

ఇవన్నీ- ఇక్కడున్న (వేస్తున్న) ఓటరు బతుక్కు దోవ చూపడం కాదు.

వాని బతుక్కు బాట వేసుకోవడం.

ఆ బాటకేం కావాలో. వాంళ్ళకు అర్థం గాకుండా పార్టీల ముసుగున మల్చి చెప్పడం.

ఇట్టా సీతాలు తల నిండా ఆలోచనలు.

సీతాలుకు ఓ అవ్వ వుంది. అది ఎన్నికలొచ్చినపుడల్లా ఓ మాట చెపుతది-

నాల్గు ఎన్నికలకు ముందు ఒకడొచ్చిండట. చూసేటందుకు మంచి పోరడనిపించిండు. జనాన్ని ఎంతో కొంత అరుసుకుంటడు. ఒంట్లో సత్తువా వుంది అనుకొని వాణ్ణి గెలిపించినారట. వాడు గెలిచి- ఆనందం పట్టలేక ఏడ్చి, దండాలెట్టి, పట్నం పోతుండట. పోయి పట్నంల ఏం మిడికిండో- కోటాల ఉన్నడో- ఎవని కాళ్ళు వదలక పట్టుకున్నడో మంత్రయిండట.

ఆనక- ఆనందంగ వచ్చి ఊళ్ళ మీదపడి- ఊరేగి, అది చేస్త ఇది చేస్తనని చెప్పి- భజన బృందాల నేర్పాటు చేసుకొని, కోళ్ళు, ఏటల్ని తెగతింటూ- బాగా తిరిగిండట. అయితే ఏడాది దాటంగనే పైన పెద్ద వాళ్ళు పదవుల కాడ ఏం తిరకాసొచ్చిందో వాడు ఏ పనీ మొదలెట్టక ముందే సభ రద్దయి మళ్ళా ఎన్నికలన్నరట.

అయితే వాని పార్టీ వుళ్ళ వానికే టిక్కెటిచ్చింది.

ఈసారి టిక్కటు ఈడికి కాదు. ఢిల్లీకి పోయేందుకు.

పైకి పోతండ. ఈ ఒక్కసారి చూద్దాం. చేద్దామన్నా అవకాశం రాలేదు. మంచి పోరడు. చేస్తడు. అనుకొని గెలిపించినారు.

వాడి నుడేందో గాని ఆడా చిన్న మంత్రయిండు. తంతె గార్లె బుట్టన పడ్డటయింది.

ఈసారి మాత్రం ఏ తఖరారూ లేకుండ చొక్కంగ అయిదేళ్ళూ ఉన్నడు. నాల్గు నెలలకు గాని ఈడకు రాలె. వచ్చేటందుకు టైమూ దొరకలే. ఇతర దేశాల్ను జూస్తే గానీ, ఈ దేశాన్ని బాగు జెయ్య యీలు గాదని. మొత్తం 'దునియ' జూసిండు. పట్నంల ఒకటి. ఢిల్లీల ఒకటి మంచి బంగ్లలు కొన్నడు. మద్రాసున సినీమా హాలు. బెంగ్లూరున నూరెకరం పోక చెక్క తోట. ఇట్టనే ఆడ కొద్దిగ ఈడ కొద్దిగ నాల్గు వందల కోట్లకు అమర్చుకున్నడని గిట్టనోళ్ళంటరు. ఏది ఏమైన ఊపిరాడకుండ తెగ తిరిగిండు బిడ్డడు.

మళ్లీ ఎన్నికలొచ్చినయి- టిక్కెట్టు వానికే ఇచ్చినారు.

ఈడ మాత్రం పూచిక పుల్లంత పని చేయలా. అయినా రాంగనే- జనం బాగ మూగినారు. దండలేసినారు. ఊరేగింపులు తీసినారు. ఇంత మంచోడు లేడని ఒక్కటే చెప్పుడు. చప్పట్లు చరుసుడు. ఇదేంది? అని అవ్వ ఆలోచించబటితే అర్థమయిందట. వాడీ తడవ మునపటోలె ఊరికే రాలేదు.

'మీకేం గావాల్నో తీసుకోండి. నాకు మాత్రం ఓట్లు వేయించండి. నేను ఇప్పటి దనుక నా పని చూసుకున్న. ఇక నుంచి మీ పని జూస్త. మీ ఋణం ఉంచుకోను అన్నాడు. చేసిండు.

'ధర్మరాజు' అనిపించుకొని గెలిచి పోయిండు.

అసలు వానికి ఈ ఆస్తంత ఏడిది? అని ఐ.టి. వాంళ్ళూ అడిగినట్టు లేదు.

దేశం. ప్రజాసేవన– అప్పులపాలైంది అని మాత్రం చెపుతుండే వాడు.

సౌరాజ్యం వచ్చిన కాడ నుంచీ గెలిచిన ప్రతోడి తంతూ ఇదే.

✧✧✧

మన 'సీతాలు'కో మనువు వచ్చింది. పోరడు పొంకంగ ఉన్నడు. పది చదివిండు. బుద్ధి ఆనక గద తెలిసేది.

కట్నం కూడ 'వద్దు' అన్నడు. అంటే పోరడు బుద్ధిగలోడనే గద!

అయితే లగ్గాలప్పుడు తిరకాసు పెట్టిండు. మగ బుద్ధి గద.

చిన్నదో చితకదో ఓ 'నౌకరీ' ఇప్పియ్యండని.

అవ్వ గిట్ట. అరె మన మంత్రి పోరడున్నడు గద! ఇదెంత పని? అనుకున్నరు.

పోరణ్ణి తీసుకొనే పట్నం పోయినారు.

ఆయన్ని కల్సెతలికి మూడు దినాలు పట్టింది. అదీ గేటోడి చేతులు తడిపి బతిమాలుకుంటే.

కనపడంగనే– ఏమో వచ్చి(న్రూ! బాగున్నరా! వచ్చే నెలల వద్దామనుకుంటండ. చానాళ్లాయ గదూ మిమ్మల్ని జూచి అని పోచయ్య భుజాన చెయ్యేసినాడు.

'పోరణ్ణి జూపి సంగతి చెప్పిండు 'పోచయ్య అవ్వ' గట్టిగా చెప్పమన్నారని చెప్పిండు.

'బాగుండు. మంచి సంబంధం చూసి(న్రు' అని సంబరంగ నవ్విండు. పొడుగు సిగరెట్టు తీసి వెలిగించిండు. మళ్ళీ భుజాన చెయ్యేసి 'ఇగో! పోచన్నా! మగాడి దగ్గర లంచం. ఆడదయితే మానం. ఇయ్యంది ఈడ పనులు గావు. మనది చానా పేద దేశం. ఇచ్చి పుచ్చుకొనుడు లేంది 'కుదిరే' కాలం ఇంకా రాలె. అని పక్కోడి వైపు అంత పెద్దగ నవ్వుతూ పోయిండు.

ఆడెంత ఇదిగ నవ్వినా– వాళ్ళకి అంతులేని దుఃఖం వచ్చింది.

నౌకరీ ఇప్పించలేకపోయినారు గనుక, ఆ మంచి పోరడు సీతాల్ను మనవాడనన్నాడు.

✧✧✧

సీతాల్ను చూసిన ప్రతోడూ అన్నీ మరచి లొట్టలేస్తడు. ఆవిళ్ళు గరుస్తరు. సొంగ కారుస్తరు. మనువనేసరికి– చాలామంది పోర్ల లెఖనే అయింది. ముల్లె ఎంతొస్తదన్న ఆలోచనల పడ్డరు. అసలీ పోరళ్ళ సంగతి బొత్తిగ అంతుపట్టదు. మంచి పోరి కనపడితె చాలు– వేదించి వెంటాడతరు. అదే దాన్ని లగ్గమాడమంటే ఎదురు అడుగుతరు. అదేదో అట్ల అడగడం తమకు జన్మ హక్కయినట్టు. అదిగో ఆ రాందాసు గానికి ఏముందని– ఏభై వేలూ ఉంగరం సైకిలిచ్చినారు. ఆడబిడ్డకని ఎయ్యి నూట పదార్లిస్తిరి. పట్టు బట్టలిస్తిరి. అని గోడ ఎక్కి దిగితె ఒట్టు. అసలు వాడేమిటో. పెళ్ళి అనేది అసలెందుకో. దాని అక్కర ఆడ, మగకి ఎట్టాటి అవసరమో. ఇవేమీ అవసరం లేదు. సమాజాన తలకెక్కిన తీరిది. ఈ చక్రాన పడి ఎందరు ఎలా బలయిపోయినా నిమ్మకు నీరెత్తినట్టుంటదే గాని ఏమిటిది? అని తేరిపార చూడరు. దీన్ని మనస్సున ఉంచుకుని చానా పౌరుషంగ పదేను దినాలు తిరిగిండు పోచయ్య.

ఈ వెతుకులాటన ఓ పోరడు తగిలిండు.

వాని పని మున్సిపాలిటీన బజార్లూడవడం. అదీ అమ్మ జస్తే వానికొచ్చిన నౌకరి.

వాణ్ణి చూస్తే పోరడు ఫరవలేదన్నట్టున్నడు. పలకరించితె మాత్రం. అమ్మో. కంపు. 'నాకు మున్సిపాలిటీల నౌకరున్నది. నలభై వేలియ్యి' అన్నడు. పిల్లని చూడకుండగనే.

పది వేల కంటే– అణా దొరకదని చెప్పెటందుకు వంద అబద్ధాలాడి కింద మీద్దైందు–

'పిల్ల బొమ్మరా' అన్న నిజాన్ని కలిపి.

వాడు పాతిక వేలకు కిందికి దిగకుండా– అనుమానంగ జూసిండు.

కుదరలే. తిరిగొచ్చినాడు. అయినా ఆగలా.

## వలస

బస్తీ మస్తీ చేస్తోంది
పల్లె పల్లెత్తు మాట అన్లేదు!
బస్తీలో మురికి మొదలయింది
పల్లె బెంగెట్టుకుంది
వాళ్లంత వలస వస్తే
తన గతీ అంతే కదా అని!!

–జిజికె రావు

కాలికి బలపం కట్టుకొని తిరుగుతరంటారే– అలా తిరిగిండు. ఫ్చ్. అనువైనోడే దొరకలా. ఒక్కడికి గూడ 'నాకు బతుకంత ఆసరాగుండే మనిషిని ఎంచుకోవాల' అన్న భావనా కనిపించలే. 'పిల్ల ఉందంటే చాలు– నేను మగోణ్ణి గద! ఎంతిస్తవు? అన్న ధోరణే.

పోచయ్య తిరుగుడు చూసింది సీతాలు. ఓ పొద్దున– పోచయ్య చెప్పిందంత విన్నది.

పెంళ్ళి కొడుకు లెంత ప్రియంగ ఉన్నరో అర్థం చేసుకున్నది. 'ఇంక తిప్పలు పడకు– నువ్వాగు– తిరగకు' అంది.

తెల్లబోయి చూసిండు.

'ఏంటా చూపు. కుదరంది ఏం చేస్తవు!' అని గదిమి. 'మనిషికి పెళ్ళి అవసరం ఓ వయస్సు వచ్చినంక ఉంటది. నాకా వయస్సేం పోలేదు. చూద్దాం' అన్నది నిబ్బరంగ.

'అదేందే! ఆ పోరణ్ణి గురించి చెపుతున్న గద!' అన్నడు.

'చెప్పినవు. విన్న. మరి వానికున్న'గొంతెమ్మ కోర్కెలేంది? నేనొవ్వ. నాతో మనువు కావాలనుకొని వచ్చినోడెవడైనా ఉంటే అప్పుడే ఆలోచిద్దాం. నా బతుకు ఎట్టా తెల్లారాలని వ్రాసిందో ఏమో? అందుకోసం నీ బతుకు తెరువును చెడుపుకోకు–' అన్నది.

పోచయ్య మనసాగక ఏదో చెప్పబోయిండు పాపం.

సీతాలు మాటాడనివ్వలేదు. నవ్వింది. అప్పటి దనక చేసిన సాయానికి దండమెట్టింది. మంచిగ తిండిపెట్టి అతన్ని సాగనంపింది.

✧✧✧

సీతాలు ఒకనికి పెళ్ళామయింది. పోచయ్య తెచ్చిన సంబంధం గాదు. అచానక్‌గ తగిలింది. చేసుకునెటోడి మనస్సు తెల్సుకొనే అవకాశం లేదు గనుక దేవునిపై భారం వేసి– మూడు ముళ్ళేయించుకున్నది. నెల దిరగకుండనే వాడూ అందరిలాంటి మగాడే అని అర్థమయింది. భూమి తిరగకుండా ఆగుతదా! సూరీడు గతి తప్పుతాడా? ఈ మగోడూ అంతే!

'పనికి పోదాంరా!' అన్నది ఒకనాడు.

'నేను పనికి పోవడమేంటి?' అన్నట్టుగ చూసాడు. 'మా అవ్వే పొమ్మనలా!' అన్నాడు కూడా.

రెండు దినాలాగి 'మగడంటే ఆలిని కాచేటోడు. సాకేటోడు. మరి ఆడదాని సంపాదన తినేటోడ్ని ఏమంటరు?' అనడిగింది నవ్వుతూనే.

'నేను సంపాదించి నిన్ను పోషించాల్నా' అని ఆగాడు.

అవునన్నట్టు చూసింది.

'నాకే పనీ రాదు' అన్నాడు.

'ఏం పని రావాల. కూలికి పోదాం. రోజు నలభై వస్తయి. మనకు సరిపోతయి. నీ వెంట నేనూ వస్తాను గనుక అవి మిగులుతయి. ఏదైనా అక్కర వచ్చినపుడు పనికొస్తయి' అంది.

'నేను కూలికా? రాను.'

'మరేం జేస్తవు? ఇల్లెట్ట ఎల్లుద్ది? తిండి?'

'నేను. నేను. మగాణ్ణి' అన్నట్టు చూసాడు.

'నేను కాదంటల్లేదు. మగడన్నా– మగాడన్నా తెలవాలిగద!'

'నాకు పెళ్ళాం దొరక్క నిన్ను కట్టుకున్న ననుకున్నవా?' ముఖం కందగడ్డలా చేసుకొని

తల్ల అడ్డంగ ఊపింది.

'మరి ఏందీ అడుగుడు?'

'మగవాడన్న వాడు ఆలిని సాకాలి. సుఖపెట్టాలి. అలాటి వాడైతేనే నా గడపలోకొచ్చేది. అయినా ఇద్దరం కల్సి పని చేసుకొని బతుకుదామంటున్న. కుదరదంటున్నవు' అని నవ్వి. అంచేత– 'ఇక నుంచి మనం ఆలుమగలం కాదు'. నా గుడిసేపు ఇక నీ మొఖం చూపకు' అంది.

'అంతేనా?' అని విసురుగ లేచాడు.

'మనుషులకు ఒక్కసారి చెప్తే సరిపోతది అని లేచింది. గుడిసెలోకి నడచింది. తలుపుల్ని ధడేల్న మూసింది.

✧✧✧

నమ్మి ఓటేస్తే– వాడు కనపడడు.

నమ్మి మనువాడితే వీడి తీరిది.

మనిషికి మనిషే తోడు అనేది ఈ లోకాన తెలిసేదెప్పుడు?

■